ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

సోమవారం 3 మార్చి 2025 | 5

రంజాన్ వేళలు | ఇఫ్తార్ (సోమ) సా.6.18 | సహరి (మంగళ) ఉ.4.59



నష్టాల్లో మిర్చి రైతులు 7

ఏలేశ్వరంలో పిచ్చికుక్క స్వైరవిహారం 7

నేటినుంచి ద్వితీయ ఇంటర్ పరీక్షలు

- అన్ని సెంటర్లలో ఏర్పాట్లు పూర్తి
- పరీక్షలకు హాజరుకానున్న 21,871 మంది విద్యార్థులు

కాకినాడ రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సోమవారంనుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాకినాడ జిల్లా డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. లాంగ్వేజ్ పేపర్-2(తెలుగు, హిందీ, సంస్కృతం) పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ జరుగుతాయని ఆలస్యంగా వచ్చే విద్యార్థులకు అనుమతి ఉండదన్నారు. రెండోఏడాది పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 21,871మంది హాజరు కానున్నారన్నారు. పరీక్షలు ఈనెల 20 వరకూ కొనసాగుతాయని, 56 పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, తాగునీరు, అత్యవసర వైద్యసదుపాయం, నిరంతర విద్యుత్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటు అధికారులు, అదనపు డీవోలు, ముగ్గురు ఫ్లయింగ్, ముగ్గురు సిట్టింగ్ స్క్వాడ్లను నియమించామన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని డీఐఈవో సూచించారు.

15 వరకూ ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఏపీ సార్వత్రిక విద్య(ఓపెన్ స్కూల్) ఇంటర్ పరీక్షలు కూడా సోమవారం నుంచి కాకినాడజిల్లాలో ప్రారంభం కానున్నాయని జిల్లాసమన్వయకర్త పి.సాయివెంకటరమణ తెలిపారు. పరీక్షలు ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ జిల్లాలో ఏర్పాటు చేసిన 24 కేంద్రాల్లో జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 6625మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. మొదటిరోజు ఆంగ్ల పరీక్ష జరుగుతుందని ఈనెల 15 వరకూ ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు కొనసాగుతాయన్నారు.

రంజాన్ ఉపవాస ప్రార్థనలు ప్రారంభం 7



పట్టభద్రుడు.. ఎవరో!



మొత్తం ఓట్లు - 3,14,984
పోలైన ఓట్లు - 2,18,902
టేబుళ్లు - 28 - రౌండ్లు 17

ఏలూరు సీఆర్ఆర్‌లో కౌంటింగ్ ఏర్పాట్లు

నేడే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్

- ఏలూరు సీఆర్ఆర్‌లో ఏర్పాట్లు
- 36 గంటల పాటు లెక్కింపు
- అధికారుల అంచనా
- నిరవధికంగా సాగేలా చర్యలు
- షిఫ్టుల వారీగా సిబ్బంది
- బరిలో 35 మంది అభ్యర్థులు
- ఫలితం తేల్చేది ప్రాధాన్యత ఓట్లే

(ఏలూరు, కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ప్రారంభం కానుంది. ఈ మేరకు ఏలూరు సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫలితం వెలువడే వరకు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఓట్ల లెక్కింపు సిబ్బందిని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ జరుగుతున్న తీరును రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పర్యవేక్షిస్తారు.అభ్యర్థుల పక్షాన ఏజెంట్లు సైతం కౌంటింగ్‌కు హాజరవుతారు. ఈ ఓట్ల లెక్కింపు కాస్త సుదీర్ఘంగానే కొనసాగబోతోంది. లెక్కింపు ఒక కొలిక్కి వచ్చేసరికి 36 గంటలు లేదా ఆపైబడి సమయం పడుతుందని భావిస్తున్నారు.

నేడు ఓట్ల లెక్కింపు..

పట్టభద్రుల నియోజకవర్గ ఓట్లను సోమవారం లెక్కించనున్నారు.గత నెల 27న పోలింగ్ జరగ్గా 2 లక్షల 18 వేల 902 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అధికార పక్షం భావిస్తోంది.పోలింగ్ సమయంలోనే నువ్వానేనా అనే ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో గత ఐదు రోజులుగా పోటీ చేసిన 35 మంది అభ్యర్థులతో పాటు, వారి అనుచరులు ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పట్టభద్రుల నియోజకవర్గంలో ప్రాధాన్యతా ఓటు ప్రకారం కొనసాగుతుంది.ఈ ప్రక్రియ అత్యంత సంక్లిష్టం కావడంతో కౌంటింగ్ సిబ్బందికి తగినంత శిక్షణ ఇచ్చారు. సోమవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉదయం 6.30 గంటల్లోపే నిర్దేశిత ప్రాంతాలకు చేరుకోవాల్సిందిగా సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది, టేబుల్స్ సూపర్‌వైజర్లు, రోల్ ఇన్‌చార్జులు, పర్యవేక్షణాధికారులు తమ పరిధిలో బాధ్యతలు నిర్వర్తించాల్సిందిగా ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు తెరిచే సమయంలో కట్టలు కట్టడం, ఆ తర్వాత లెక్కించే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ మేరకు జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించి మార్గనిర్దేశం చేశారు.

లెక్కింపునకు 36 గంటలు

సాధారణ ఎన్నికల కంటే భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ నేపథ్యంలోనే దాదాపు 2 లక్షలకు పైగా బ్యాలెట్ పత్రాలను లెక్కించాల్సి ఉంది. అందుకే ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. తొలుత మొత్తం పోలైన ఓట్లలో చెల్లుబాటు కాని ఓట్లను గుర్తిస్తారు. ఇవి పోను, మిగిలిన ఓట్లను ప్రాధాన్యత క్రమంలో ఏ అభ్యర్థికి దక్కాయో వరుసగా లెక్కిస్తారు.ఈ ప్రక్రియ యావత్తు కొనసాగడానికి కాస్త సమయం పడుతుంది. ఓట్ల లెక్కింపు నిరవధికంగా కొనసాగడానికి వీలుగా లెక్కింపు సిబ్బంది,అధికారులను షిఫ్టుల వారీగా నియమించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పోలైన 2 లక్షల 18 వేల 902 ఓట్లను ఒక కొలిక్కి తేవాలంటే ఒక రోజంతా పడుతుందని భావిస్తున్నారు. ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపునకు 28 టేబుళ్లు.. 17 రౌండ్లుగా ఉండేటట్లు నిర్దేశించారు. దీనికి అనుగుణంగా అన్నీ ఏర్పాట్లు చేశారు. ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు పోటీ చేసినందున ఆ మేరకు మరింత అప్రమత్తం అయ్యారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ముందుగా చెల్లని ఓట్లను తొలగించడం, మిగతా ఓట్లను కట్టలుగా కట్టి టేబుల్‌కు వెయ్యి చొప్పున మొత్తం 28 టేబుళ్లకు కలిపి 28 వేల వేల ఓట్లు లెక్కించడం ఆరంభిస్తారు. ఇలా 17 రౌండ్ల లెక్కింపు సాగుతుంది. రాత్రి పొద్దుపోయే సమయానికి ఈ ముందస్తు ప్రక్రియ ఒక్క కొలిక్కి రాగలదని,ఆ తర్వాతే అసలు సిసలైన ఓట్ల లెక్కింపు గాడినపడుతుందని అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆసాంతం పదేపదే సరిచూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడున్న అధికారిక అంచనాల ప్రకారం లెక్కింపునకు 36 గంటలు దాటి సమయం పట్టే అవకాశం ఉంది.

నేడు ఎమ్మెల్సీ ఉత్కంఠకు తెర

రాజమహేంద్రవరం/అమలాపురం/కలెక్టరేట్(కాకినాడ),మార్చి2(ఆంధ్రజ్యోతి):మరికొన్ని గంటల్లో ఎమ్మెల్సీ ఉత్కంఠకు తెరపడనుంది. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 35 మంది పోటీ పడగా గురువారం పోలింగ్ జరిగింది. ఈ మేరకు ఓట్లను సోమవారం ఏలూరులో లెక్కించనున్నారు. మొత్తం 3,14,984 ఓట్లు ఉండగా, 2,18,902 ఓట్లు పోలైన సంగతి తెలిసిందే. ఇది 69.50 శాతం.అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో మొత్తం 4669 ఓట్లు ఉండగా 3637 ఓట్లు పోలయ్యాయి. ఇది 77.9 శాతం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం 64,471 ఓట్లు ఉండగా 47,125 ఓట్లు పోలయ్యాయి. ఇది 73.09 శాతం. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 62,970 ఓట్లు ఉండగా 42,446 ఓట్లు పోలయ్యాయి. ఇది 67.41శాతం. ఏలూరు జిల్లాలో 42,282 ఓట్లు ఉండగా 29,651 ఓట్లు పోలయ్యాయి. ఇది 70.13 శాతం. కాకినాడ జిల్లాలో మొత్తం 70,540 ఓట్లుండగా, 47,150 పోలయ్యాయి. ఇది 66.84 శాతం. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 70052 ఓట్లు ఉండగా, 48,893 ఓట్లు పోలయ్యాయి. ఇది 69.8శాతం. ప్రధానంగా పోటీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం..పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవుల మధ్యన ఉన్నట్టు సమాచారం. పట్టభద్రులు ఎవరికి పట్టం కట్టారనేది మరికొన్ని గంటల్లోనే తేలిపోనుంది. ఆరు జిల్లాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను ఏలూరులో భద్రపర్చారు. ఓటింగ్ సరళి ప్రకారం పరిశీలిస్తే.. ఫలితాలు రావడానికి 14గంటలుగానీ, 36 గంటల నుంచి 48 గంటలుగానీ సాగే అవకాశం ఉందంటున్నారు.



కాటన్ బ్యారేజీకి మంచిరోజులు

117 గేట్ల మార్పునకు నిధులు

- ఫలించిన ఎదురుచూపులు
- బ్యారేజీ మరమ్మతులకు నిధులు
- రూ.150 కోట్ల ప్రతిపాదనలు
- రూ.146 కోట్లు మంజూరు
- నేడో రేపో టెండర్లు పిలుపు
- గత ప్రభుత్వంలో చిన్నచూపు
- ఐదేళ్లు కనీస మరమ్మతుల్లేవ్
- కూటమి రాకతో బ్యారేజీపై దృష్టి
- నిధుల విడుదలకు ప్రయత్నాలు
- డ్రిప్ పథకం కింద మంజూరు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి పూర్వవైభవం రానుంది.కూటమి ప్రభుత్వం చొరవ కారణంగా ఈ వారంలో డ్రిప్ పథకం కింద రూ.146 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ వేసవిలోనే టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టనున్నారు. దీంతో బ్యారేజీ మనుగడకు ముప్పు తప్పినట్టయింది. గత ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరైన నిర్వహణ లేక కాటన్ బ్యారేజీ మరమ్మతులకు గురైంది. ఈ మేరకు ఢిల్లీలోని సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యుసీ) 2022లో స్వయంగా పరిశీ లించి తక్షణం మరమ్మతులు చేయకపోతే సమస్య ఉత్పన్నమవుతుందని అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అయినా పట్టించుకోలేదు. గతేడాది జనవరి 11,12 తేదీల్లో ప్రపంచ బ్యాంక్ నిపుణుల బృందం బ్యారేజీని పరిశీలించి మొత్తం 117 గేట్లను మార్చి కొత్తవి అమర్చాలని సూచించింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కదలికలేదు. ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకూ 7 కిలోమీటర్ల పొడవున బ్యారేజీకి 175 ఫ్లడ్ గేట్లు, 22 స్లూయిజ్‌లు కలిసి మొత్తం 197 ఉన్నాయి. గత ప్రభుత్వం అసలు బ్యారేజి నిర్వహణ పట్టించుకోకపోవడంతో చాలా గేట్లు నిర్వహణ కష్టమవుతోంది.ఆపరేట్ చేసే సమయంలో అవి మొరాయిస్తున్న సంగతి కూడా తెలిసింది.

10.5 లక్షల ఎకరాల ఆయకట్టు

వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరంతా లక్షలాది టీఎంసీలు ధవళేశ్వరం కాటన్ బ్యారేజి గుండా దిగువకు వెళ్లాల్సిందే. ఎంత నీరు వచ్చినా 175 గేట్లు దాటి అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుండా సముద్రంలోకి పోతుంది. అంతే కాకుండా ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో తూర్పుగోదావరి, కాకినాడ,అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 10.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు బ్యారేజీ కారణంగానే నీరందుతుంది. 2 కోట్ల మంది ప్రజలకు మంచినీరు, పలు పరిశ్రమలకు నీరు లభిస్తోంది.బ్యారేజి ఏ మాత్రం దెబ్బతిన్నా ఏటిగట్టూ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.ఇంతటి ప్రాధాన్యత ఉన్న బ్యారేజీ కాపాడడానికి వైసీపీ ప్రభుత్వం కనీస ఆలోచన చేయలేదు.సీడబ్ల్యుసీ నిపు ణులు 117 గేట్లు మొత్తం మార్చేయాలని చెప్పినా పట్టించు కోలేదు.ఇరిగేషన్ అధికారులు కొన్ని ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు.

నిధులు మంజూరు ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ బ్యారేజీని డ్యామ్ రిహేబిటేషన్ అండ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రామం (డ్రిప్)లో పెట్టారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ నుంచి గత జూన్‌లో అప్పటి డీఈ రమేష్ ఢిల్లీ వెళ్లి రూ.150కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చి వచ్చారు. ఇందులో గేట్లు రీప్లేస్‌మెంట్, మరమ్మతులకు రూ.110 కోట్లు అంచనా వేశారు. ఎలక్ట్రికల్ , కేబుల్, కంట్రోలు ప్యానల్‌కు సుమారు రూ.9.5కోట్లు అంచనా వేశారు. రోడ్ల నిర్మాణానికి రరూ.4 కోట్లు,సివిల్ వర్కుకు రూ.18 కోట్లు, భవన నిర్మాణానికి రూ.3 కోట్లు అంచనా వేశా రు. రూ. 150 కోట్లు ప్రతిపాదించగా రోడ్ల నిర్మాణం పూర్తికావడంతో రూ.146 కోట్లకు అనుమతిచ్చి శాంక్షన్ చేశారు.దీంతో బ్యారేజీకి మంచిరోజులొచ్చినట్టు అయింది.

కాకినాడ ఆర్ఎంసీలో.. వైభవంగా స్నాతకోత్సవ సంబరం

7

- 248మంది వైద్యవిద్యార్థులకు పట్టాల ప్రదానం



ఆర్ఎంసీ స్నాతకోత్సవంలో పట్టాలు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం

ఎంవీఐ చట్టం ఉల్లంఘనలపై.. భారీగా పెరిగిన జరిమానాలు

కాకినాడ క్రైం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మోటారు వాహన చట్టం(ఎంవీఐ) ఉల్లంఘనలపై జరిమానాలు భారీగా పెరిగాయి. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే సదుద్దేశ్యంతో హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం కొత్తగా పెరిగిన జరిమానాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడిపితే గతంలో రూ.100 జరిమానా ఉండేది. ప్రస్తుతం ఆ జరిమానాను రూ.1000కు పెంచారు. మూడు నెలల వరకు లైసెన్స్ రద్దు చేస్తారు. కారును సీటు బెల్ట్ లేకుండా డ్రైవ్ చేస్తే రూ.100ఉండే జరిమానా రూ.1000కు పెంచారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.500 జరిమానా లేదా మూడు నెలల జైలు శిక్ష గతంలో ఉండేది. ప్రస్తుతం ఆ జరిమానాను రూ.5000కు పెంచారు. లైసెన్స్ లేకుండా వాహనాలను అనధికారికంగా అనుమతించినందుకు గతంలో రూ.1000 జరిమానా ఉంటే అది ఇప్పుడు రూ.5000కు పెంచారు. మైనర్ డ్రైవింగ్‌కు గతంలో రూ.500 జరిమానా ఉంటే అది ఇప్పుడు సంరక్షకుల యజమాని తప్పు చేసిన వారిగా గుర్తించబడతారు. దీనికి రూ.25000 జరిమానాతోపాటు మూడేళ్ల జైలు శిక్ష ఉంటుంది. ఒక సంవత్సరం వాహన రిజిస్ట్రేషన్ రద్దు అవుతుంది. 25ఏళ్ల వరకు లైసెన్స్ పొందేందుకు అనర్హులవుతారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసే వారికి గతంలో రూ.500 జరిమానా లేదా 3నెలలు జైలు శిక్ష ఉండేంది. అదే ప్రస్తుతం మొదటి నేరం కింద రూ.1500 జరిమానా, రెండో నేరం కింద రూ.10,000 జరిమానా విధిస్తారు. గతంలో ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపిన వారికి రూ.1000 జరిమానా ఉండేది. అది ప్రస్తుతం రూ.2,000 జరిమానా లేదా 3నెలలు జైలు శిక్ష ఖరారవుతుంది. ట్రిపుల్ డ్రైవింగ్‌కు గతంలో రూ.100ఉన్న జరిమానా ప్రస్తుతం రూ.1000కు పెరిగింది. మితిమీరిన వేగంతో డ్రైవ్ చేస్తే గతంలో రూ.400 జరిమానాఉంటే అది ప్రస్తుతం రూ.1000కు పెరిగింది. వాహనం నెంబర్ ప్లేట్ సరిగా లేకపోతే జరిమానా రూ.300కు పెరిగింది.శబ్ధకాలుష్యానికిజరిమానారూ.1500 నుంచి రూ.3000కు పెరిగింది. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10,000 నుంచి రూ.15,000వరకు జరిమానా లేదా 6నెలల నుంచి రెండేళ్లవరకు జైలుశిక్ష అమలవుతుంది.

పల్లెకు.. పండగేది!



అసంపూర్తిగా గోకులం షెడ్

బిల్లులు రాక.. నిలిచిన పనులు

- ఇప్పటికే నీరసించిన పనులు
- ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి
- రూ.147 కోట్లు పెండింగ్
- సీసీ రోడ్లవే రూ.110 కోట్లు
- అసంపూర్తిగా గోకులాలు
- పూర్తికాని డ్రెయినేజీల నిర్మాణం
- ఎక్కడి పనులు అక్కడే
- నిధులు రాక కాంట్రాక్టర్ల లబోదిబో

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

పల్లె పండగ పేరుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అనేక పనులు అప్పుడే నీరసించాయి. బిల్లులు రాకపోవడంతో రెండు నెలలుగా ఎక్కడివి అక్కడే అన్నట్టు ఈసురోమంటున్నాయి. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి సంబంధించి బిల్లులు ఆలస్యం అవడంతో పలు చోట్ల వీటిని కాంట్రాక్టర్లు నిలిపివేశారు. బిల్లులు వచ్చాక తిరిగి చేద్దామనే ధోరణితో మధ్యలోనే వదిలేశారు. అటు గోకులాల షెడ్లను తొలుత సొంత నిధులతో ప్రారంభించిన రైతులు సైతం బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.4 కోట్ల వరకూ బిల్లులు విడుదల కావాల్సి ఉంది. ప్రధానంగా ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లా వ్యాప్తంగా రూ.147 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రూ.110 కోట్లకుపైగా బకాయిలు సీసీ రోడ్లవే కాగా మిగిలినవి గోకులాల షెడ్ల బాకీలున్నాయి. అయితే బకాయిల్లో కేంద్రం నుంచి సగానికిపైగా, మిగిలినవి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ నుంచి విడుదల కావాల్సి ఉన్నాయి. మరో పక్క రైతులు ముందుకురాని చోట్ల కాంట్రాక్టర్లు నిర్మించిన గోకులాల షెడ్లలో అప్పుడే నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి.



అసంపూర్తిగా ఉన్న సీసీ రహదారి

వచ్చాక చూద్దాం..

వాస్తవానికి రెండునెలలుగా అధికారులు అదిగోఇదిగో అంటున్నా బిల్లులు రాకపోవడంతో అటు కాంట్రాక్టర్లు, ఇటు రైతులు పనులను మధ్యలో ఆపేశారు. సీసీ రహదారులకు సంబంధించి ఒక్కో పనిని రూ.3 లక్షల వరకు విభజించి నామినేషన్ ప్రాతిపదికపై కాంట్రాక్టర్లకు అప్పగించారు. వీరంతా చిన్నాచితకా కాంట్రాక్టర్లు కావడంతో బిల్లులు రాక పనులు చేయలేమని తెగేసి చెప్పేస్తున్నారు. కొందరైతే ప్రారంభించినవి మధ్యలో ఆపేయగా, మరికొందరు బిల్లులు వస్తేనే పని మొదలుపెడతామని తెగేసి చెబుతున్నారు. వాస్తవానికి పల్లె పండగకు పనులకు సంబంధించి ఉపాధి హామీ పనుల ద్వారా సమకూరే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వెచ్చిస్తున్నారు. ఈ నిధులు 75 శాతం కేంద్రం, మిగిలిన 25 శాతం రాష్ట్రప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆర్థికంగా అనేక ఇబ్బందులున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడానికి కొంత జాప్యమవుతోంది. కాగా ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల గోకులాల షెడ్లను ముందుగా తమ సొంత నిధులతో నిర్మించుకోలేని రైతుల కోసం అధికారులే కొందరు కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పనులు చేయి ంచారు. వీటిలో చాలా వరకు నాణ్యతా లోపాలు బయటపడుతుండడం విశేషం.

రూ.147 కోట్ల బకాయి

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల పరిధిలో కొత్తగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం గతేడాది అక్టోబరు 14 నుంచి పల్లె పండగ పేరుతో అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఉపాధి హామీ పథకానికి సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్, ఆర్థిక సంఘం నిధుల ద్వారా బిల్లులు చెల్లించే విధంగా పనులకు జిల్లాల వారీగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామాల్లో ఎక్క డెక్కడ సీసీ రోడ్లు, డ్రెయినేజీలు అవసరమో గుర్తించి వాటిని నిర్మించడానికి వీలుగా అంచ నాలు సిద్ధం చేశారు. రైతుల కోసం గోకులాల షెడ్లను ఈ పథకంలో చేర్చారు. సీసీ రహదారులు, డ్రెయిన్లు, గోకులాల షెడ్లకు సంబంధించి కాకినాడ జిల్లాలో మొత్తం రూ.180 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. ఇందులో ఇప్పటి వరకు రూ.38 కోట్ల బిల్లులు చెల్లించారు. కానీ పూర్తయిన, మధ్యలో కొనసాగుతున్న పనులకు సంబంధించి ఇంకా రూ.42 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. డిసెంబరు నెలాఖరు వరకు ఠంచనుగా వచ్చిన బిల్లులు ఆ తర్వాత నుంచీ పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా అనేక పనులను అటు కాంట్రాక్టర్లు, ఇటు రైతులు నిలిపివేశారు. బిల్లులు వస్తేనే తిరిగి చేయగలమంటూ అధికా రులకు తెగేసి చెప్పేశారు. మరో పక్క బిల్లులు రాకపోవడంతో రూ.102 కోట్లకు సంబంధించి వివిధ దశల్లో ఉన్న పలు పనులపైనా ప్రభావం పడింది. అనేక చోట్ల కాంట్రాక్టర్లు వీటిని మధ్యలో నిలిపివేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 650 సీసీ రహ దారులు, 675 గోకులాల షెడ్లను ఈ పథకం కింద ప్రారంభించారు.ఇప్పటి వరకు కొన్ని బిల్లులు చెల్లింపులు జరగ్గా, ఇంకా రూ.65 కోట్ల వరకు బాకీలు పేరుకుపోయాయి.ఇందులో రూ.4 కోట్ల వరకు గోకులాల షెడ్లకు సంబం ధించిన బిల్లులుండగా,మిగిలిన రూ.61 కోట్లు సీసీ రహదారులవే ఉన్నాయి.అటు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోను రూ.40 కోట్ల వరకు బిల్లులు పేరుకుపోయాయి. సింహభాగం సీసీ రహదారులవే. మొత్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.147 కోట్లు బకాయిలుగా తేలాయి.ఇవి రాక అనేక పనులపై ప్రభావం పడింది.

మిర్చి పంటను పీల్చేస్తున్న తామర పురుగు



తామరపురుగు సోకి దిగుబడిన లేని మిర్చి తోట

» వెలవెలబోతున్న మిర్చి తోటలు » దెబ్బతిని నల్లగా మారిపోతున్న వైనం
» పంట దిగుబడిపై తీవ్రప్రభావం » నష్టాల్లో మిర్చి రైతులు

ఎటపాక, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఎర్ర బంగారంగా పిలిచే మిర్చిపంటకు గత నాలుగేళ్లగా ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. వాణిజ్య పంట అయిన మిర్చికి తామరపురుగు పట్టి పీడిస్తూ ఉండడంతో పాటు వరుస నష్టాలతో రైతులు ఇక మున్ముందు పంటకు విరామం ప్రకటించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అసలే మిర్చి పంటకు సరైన ధరలేక రైతు సతమతమవుతున్న తరుణంలో పంటకు తామర పురుగు సోకి, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో రైతుకు కోలుకోలేని విధంగా దెబ్బమీద దెబ్బ తగులుతోంది. దాంతో మిర్చి సాగుని నమ్ముకున్న రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక సాగు చేయడం తమవల్ల కాదంటూ తేల్చి చెబుతున్నారు. అల్లూరి జిల్లాలోని విలీన మండలాల్లో ఈ ఏడాది సుమారు 4 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. గతనెల జనవరి వరకు పంటకు తామర పురుగు వ్యాపించకుండా బాగున్నప్పటికీ ఫిబ్రవరి ప్రారంభంలో మిర్చి పంటకు తామర పురుగు ఆశించింది. అయితే ఈ పురుగు పంటకు పూత దశలో వ్యాపించడంతో పంట ఆకు రసం పీల్చి, పంట స్వరూపాన్ని మార్చేస్తోంది. ఆ తర్వాత పంట ముడతబారి, నల్లగా మారిపోయి దిగు బడిపై తీవ్ర ప్రభావంను చూపుతోంది. ఎన్ని రకాల పురుగు మందులు పిచికారీ చేసినా ఎటువంటి ప్రయోజనం ఉండడంలేదని రైతులు పేర్కొంటున్నారు.

కళా విహీనంగా మిర్చి తోటలు

ఈ ఏడాది జనవరి నెల వరకు బాగానే ఉన్నా మిర్చి తోటలు ఫిబ్రవరిలో సోకిన తామరపురుగుతో తోటలన్నీ కళాహీనంగా మారి వెలవెలబోతున్నాయి. సాధారణ సమయంలో ఎకరాకు 20 నుంచి 25 క్వింటాల వరకు పంట దిగుబడి వచ్చేదని తామరపురుగు ప్రభావంతో ఎకరాకు ఆరేడు క్వింటాల మించి దిగుబడిరాని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఎటపాక మండలంలో ప్రధానంగా గన్నవరం, తోటపల్లి, నందిగామ, మురుమూరు, కృష్ణవరం నల్లకుంట, విస్సాపురం, నెల్లిపాక తదితర గ్రామాల్లో మిర్చి తోటలకు తామరపురుగు ఆశించింది. గత నెలలో మొదటి దశ మిర్చి కోతలు నిర్వహించారు. ఆ తర్వాత తామర పురుగు వ్యాపించడంతో దిగుబడి రాక తోటలన్నీ పంటకాలం ముగిసినట్టుగా మారి పోయాయి. దాంతో రైతులు కొందరు పశువులను ఆ తోటల్లో మేపుతున్నారు.



గన్నవరంలో తామరపురుగురు సోకిన తోటలో పశువులను మేపుతున్న రైతు

తగ్గిన పంట దిగుబడి

తామరపురుగు, వైరస్‌ల ప్రభావంతో గత నాలుగేళ్లగా మిర్చి రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. రెండేళ్ల నుంచి మిర్చి రైతులది గడ్డు పరిస్థితి. ఈఏడాది సాగుకు సాహసించని పరిస్థితి. అయినా ఈసారైనా పంట కలిసోస్తుందని కొండంత ఆశతో సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది పెరిగిన ఖర్చులతో ఎకరాకు రూ 1.50లక్షల పెట్టుబడులు అయినట్లు రైతులు చెబుతున్నారు. తామరపురుగు దెబ్బకు ఎకరాకు ఆరేడు క్వింటాలు మాత్రమే పంట దిగుబడి వచ్చిందని, మరోసారి పంట కోతలు చేపట్టే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడ్నాలుగుసార్లు కోతలు చేపట్టే మిర్చికి ఒక్కసారి కోతలతో ముగించేసే పరిస్థితి రావడంతో రైతులు నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి దిగుబడి ఆ స్థాయిలో లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే తోటలన్నీ కళతప్పి ఉన్నాయి. మరోవైపు ప్రస్తుత మిర్చి క్వింటా ధర రూ.11వేల నుంచి 12వేల మధ్య పలుకుతోందని, ఇంతలా ధర ఎప్పుడూ పతనమవలేదని రైతులు పేర్కొంటున్నారు.

రూ.15 లక్షలు నష్టపోయాను

● పూజారి వెంకన్న, రైతు, గన్నవరం



ఈఏడాది 9ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. జనవరి నెల వరకు పంట బాగానే ఉన్నా, గత ఇరవై రోజుల నుంచి మిర్చికి తామరపురుగు ఆశించింది. 9 ఎకరాల పంట మొత్తం నల్లగా మారి దెబ్బతింది. ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పంటకు రూ15 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. రూ 14 లక్షల నష్టం వచ్చింది.

తామరపురుగు వదలడంలేదు

● మల్లాడి దావీద్, రైతు, గొల్లగూడెం



గత మూడేళ్ల నుంచి మిర్చికి తామరపురుగు వ్యాపించే పీడ పోవడంలేదు. ఎన్ని మందులు పిచికారీ చేసినా పూర్తి స్థాయిలో పురుగు నశించడంలేదు. వ్యవసాయశాఖ అధికారులు తామర పురుగు శాశ్వత నివారణకు చర్యలు అన్వేషించడంలేదు. వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు పంటపై పరిశోధనలు చేసి తామర పురుగును అరికట్టాలి.



రాయవరం: వెదురుపాక మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

● ఉపవాస ప్రార్థనలు ప్రారంభం



కాకినాడలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రాయవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దైవ గ్రంథం ఖురాన్ అవతరించిన నెలకు ఇస్లాం మతంలో ప్రత్యేకస్థానం ఉంది. ముస్లింలకు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభమైంది. శనివారం రాత్రి నెలవంక కనిపించడంతో ముస్లిం పెద్దల ఆదేశాలకు అనుగుణంగా 2వ తేదీ నుంచి నెలరోజుల పాటు ముస్లింలు నెలరోజు లపాటు పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు చేపట్టారు. ఈనెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు, ప్రత్యేక నమాజ్‌లను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఇందులోభాగంగా తెల్లవారుజాము నుంచి ఉపవాస దీక్షలు చేపట్టి ముస్లింలు రాత్రి వరకు దైవారాధనలో గడుపుతారు. ఖురాన్ సూచించిన విధంగా నెలరోజులపాటు ఉపవాసం సమయంలో మంచినీరు తీసుకోకుండా రాత్రి వరకు దీక్ష కొనసాగిస్తారు. వెదురుపాక, రాయవరం, లొల్ల, చెల్లూరు, పసలపూడి గ్రామాల్లో ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాస దీక్షలు చేపట్టారు. వెదురుపాకలో మతపెద్ద షేక్ అహ్మద్ బాషా ఆధ్వర్యంలో మసీదును విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగర పరిధిలోని ఉన్న అన్ని మసీదులు ముస్లిం భక్తులతో నిండి కిటకిటలాడాయి. నెలరోజులపాటు జరిగే ఉపవాస దీక్షల్లో ముస్లిం ప్రజలు పాల్గొని ఈ ఉపవాస దీక్షలను అవలంభిస్తారు. మసీదుల్లో ప్రార్థనలు ప్రారంభమవగా ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రంజాన్ విశిష్టతను జాబియా మసీదు అధ్యక్షుడు ఏజాజుద్దీన్ మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ముస్లిం లు కఠోర ఉపవాస దీక్ష ఉండి సాయంత్రం మసీదులో దీక్షను విరమిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా గంజిని అన్ని మసీదుల్లో తయారుచేస్తామన్నారు. దీన్ని సేవించడంవల్ల శరీరంలో ఉన్న నీరసంపోయి శక్తి వస్తుందన్నారు. అలాగే రాత్రి 8.30కు జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో ఖురాన్ పఠిస్తామని తెలిపారు.

కవి సంధ్య కవితల పోటీ విజేతలు

యానాం,మార్చి2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా యానాం కవిసంధ్య, చిన్ని నారాయణరావు ఫౌండేషన్ నెల్లూరు సంయుక్తంగా నిర్వహించిన వచన కవితల పోటీ విజేతలను కవి సంధ్య అధ్యక్షుడు శిఖామణి ప్రకటించారు. వీరిలో ప్రథమ బహుమతి నూజివీడుకు చెందిన డాక్టర్ జడా సుబ్బారావు (ఒంటరై ఉమ్మడి తనం), ద్వితీయ బహుమతి తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేటకు చెందిన పర్కపల్లి యాదగిరి (తర్పణం), తృతీయ బహుమతి దుబ్బాకకు చెందిన ఐలేని గిరి (నడిచిన పాదాలు) నిలిచారు. అదేవిధంగా పది కవితలకు ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు. వీరిలో శ్రీకాకుళంనకు చెందిన వినోద్ గుత్తం (పాపం నాజేబు), తూర్పుగోదావరిజిల్లాకు చెందిన మోకా రత్నరాజు (సృష్టికర్తలం), గోకవరంనకు చెందిన జేడీ వరలక్ష్మీ (శ్రమదేహాలు), తెలంగాణా రాష్ట్రం ఆదిలాబాద్‌కు చెందిన బి.వేణుగోపాలరెడ్డి (సాగుదూరం), యానాంకు చెందిన పోనుగుమట్ల అశోక్‌కుమార్ (పచ్చని చెట్టులా), విజయవాడకు చెందిన బి.వి.శివప్రసాద్ (యుద్ధము-శాంతి), తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన పిన్నంశెట్టి కిషన్ (ఇల్యూషన్), నిర్మల్‌కు చెందిన తమ్మల దేవ్‌రావ్(వరి గొలకులు), తెలంగాణా రాష్ట్రం ఆదిలాబాద్‌కు చెందిన ఉదారి నారాయణ (గాజుల పండుగ)లు ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యారు. ఈపోటీలకు ప్రముఖ కవి కోడూరి విజయ్‌కుమార్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈనెల 23న ఆదివారం సాయంత్రం హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయంలో జరిగే ప్రపంచ కవితా దినోత్సవంలో బహుమతులను ప్రదానం చేయనున్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కాకినాడ క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురం స్వప్న థియేటర్ సమీపంలో పేకాడుతున్నారన్న పక్కా సమాచారంతో సీఐ ఎం.నాగదుర్గారావు తన బృందంతో కలిసి శిబిరంపై ఆదివారం దాడి చేశారు. 12 మందిని కాకినాడ వన్ టౌన్ పోలీసులు అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.22,620 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కొత్తపల్లిలో ఘరానా మోసం

● రుణాలు ఇప్పిస్తానంటూ లక్షలాది రూపాయలు వసూలు

కొత్తపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అమాయకులైన వ్యక్తుల బలహీనతలను ఆసరాగా తీసుకుని వారి అవసరాలకు రోజువారీ అప్పులు, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తానంటూ వేలకు వేలు దోచుకున్న ఘరానా మోసగాడి విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాకినాడకు చెందిన వి.ప్రసాద్ సెక్యూరిటీ సర్వీస్‌లో పనిచేసేవాడు. కాకినాడజిల్లా కొత్తపల్లికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో పరిచయాలు పెంచుకున్నారు. తక్కువ వడ్డీకి అప్పులు, ప్రైవేటు బ్యాంకులో రుణాలు ఇప్పిస్తానంటూ కొత్తపల్లికి చెందిన పలువురు చేతి పనులు, కూలీనాళీ చేసుకునే వారి దగ్గర నుంచి రూ.3వేలు నుంచి రూ.5వేలు వరకు నగదుతో పాటు ఆధార్‌కార్డులు తీసుకున్నాడు. తాను కూడా ఈ విధంగా మోసపోయానని బాధితుడు ఉడతా వెం కన్న వాపోయాడు. మోసం చేశాడని గ్రహించిన వారు ప్రసాద్‌ను సొమ్ము మొత్తాన్ని ఇవ్వమని ప్రాధేయపడగా తమపై కేసులు పెడతానని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగి న అన్యాయంపై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వెంకన్న చెప్పాడు.

'జయలక్ష్మి సొసైటీ పాలకవర్గం పనితీరుపై అసంతృప్తి'



సమావేశంలో మాట్లాడుతున్న బదిరీనాథ్

సర్పవరంజంక్షన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరానికి పాల్పడినవారు బెయిల్‌పై బయట తిరగడం, సిట్ నివేదిక ప్రకారం బోర్డు బకాయిల వసూళ్లు, నిందితులపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవడంలో ఉదాసీన వైఖరి, సిట్ నిందితుడిగా పేర్కొన్న వ్యక్తిని డైరెక్టర్‌గా కొనసాగించడం, జవాబుదారీతనం లోపించడంవంటి కారణాలతో జయలక్ష్మి సొసైటీ పాలకవర్గంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు దిజయలక్ష్మి ఎంఎం సొసైటీ లిమిటెడ్ డిపాజిటర్స్ బాధితుల సంఘం సభ్యులు తెలిపారు. బోర్డు సభ్యులను రీకాల్ చేసేందుకు తక్షణం మహాజన సభ నిర్వహించి సీక్రెట్ ఓటింగ్ తో పాలకవర్గాన్ని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కాకినాడ విద్యుత్‌నగర్‌లోని చల్లా కల్యాణ మండపంలో జయలక్ష్మి సొసైటీ డిపాజిటర్ల బాధితుల సంఘం సభ్యు ల సమావేశాన్ని అధ్యక్షుడు జి.బదరీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయనతోపాటు సెక్రటరీ పిల్లి గణేష్, జాయిం ట్ సెక్రటరీ ఎస్.రామారావు, ట్రెజరర్ వీఎస్ సుబ్బారావు, కొంతమంది సభ్యులు మాట్లాడా రు. 2022 ఏప్రిల్‌లో రూ.560 కోట్లతో బోర్డు తిప్పేసిన అప్పటి ఛైర్మన్ ఆంజనేయులు, వైస్ ఛైర్‌పర్సన్ విశాలాక్ష్మిలతోపాటు డైరెక్టర్లు పరారయ్యారన్నారు. బాధితులంతా కలిసి అడ్‌హక్ కమిటీ, తర్వాత పర్మినెంట్ బోర్డు ఏర్పాటు చేసుకున్నారు. నూతన కమిటీ పగ్గాలు చేపట్టి రెండున్నర ఏళ్లు కావస్తున్నా బాధిత డిపాజిటర్లు ఆశించిన మేర పనిచేయలేదన్నారు. అర వై మంది బాధితులు మృతి చెందారన్నారు. కేసుల వివరాలు, నిందితుల ఆస్తులజప్తు వివరాలు, సివిల్, క్రిమినల్ కేసులపై సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వట్లేదని విమర్శించారు. బోర్డులో ఉన్న ఇద్దరు సభ్యులు ఉద్యోగరీత్యా వేరేచోట ఉంటున్నారన్నారు. డైరెక్టర్ల స్టాగర్డ్ టర్మ్ పూర్తవ్వడం, డైరెక్టర్లు రాజీనామా చేసిన వాటి వివరాలను ఛైర్మన్ ఎవరికీ చెప్పట్లేదని ఆరోపించారు. బ్యాంకింగ్, కో-ఆపరేటివ్ సెక్టార్లలో అనుభవమున్న సభ్యులతో డైరెక్టర్లను భర్తీచేయాలని కోరినా పట్టించు కోవట్లేదన్నారు. ప్రభుత్వ అధికారులను డైరెక్టర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు.100మంది బాధితులు పాల్గొన్నారు.

కాకినాడ ఆర్ఎంసీలో..

వైభవంగా స్నాతకోత్సవ సంబరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహం

248మంది వైద్యవిద్యార్థులకు పట్టాల ప్రదానం

ముఖ్యఅతిథిగా డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ నరసింహం

జీజీహెచ్(కాకినాడ), మార్చి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో 62వ స్నాతకోత్సవ సంబరం అంబరాన్నంటింది. 2019-2025 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన సుప్రీం స్టాల్ వార్ట్స్ బ్యాచ్ అన్నీ తామై స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించింది. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 248మంది వైద్యవిద్యార్థులు పట్టాలు పొందారు. కార్యక్రమానికి 5వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంఈ, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరయ్యారు. గౌరవ అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి హాజరయ్యారు. కార్యక్రమంలో విజయనగరం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, హెచ్‌వోడీలు డాక్టర్ డి.మాణిక్యాంబ, డాక్టర్ ఉమామహేశ్వరరావు, ఐఎంఏ నాయకులు డాక్టర్ చిట్ల కిరణ్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ ఆదిత్య సత్యప్రసన్న, ఆర్ఎంసీ బోధకులు డాక్టర్ ఎన్.శైలజ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైద్యరంగంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వైద్యుడికి ప్రత్యామ్నాయం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదని పేర్కొన్నారు. భావోద్వేగాలను గుర్తించే గుణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు లేదన్నారు. తాను ఆర్ఎంసీనుంచి వెళ్లి రాష్ట్రంలో అత్యున్నత స్థానంలో కీలక విధులు నిర్వర్తించడానికి తనకు ప్రత్యామ్నాయంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ప్రిన్సిపాల్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించడమే కారణమన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు చేసిన త్యాగాలను ఎన్నటికీ మరువరాదన్నారు. డాక్టర్ దేవీమాధవి, డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు ఇది ఒక కొత్త అధ్యాయమన్నారు. విద్యార్థులు వైద్యులుగా మాత్రమే కాకుండా రోల్ మోడ ళ్లుగా తీర్చిదిద్దాలన్నారు. రోగులు, సమాజం పట్ల కృతజ్ఞతతో మెలగాలన్నారు. పేరు ముందు డాక్టర్ అని రావడం గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థులతో వైద్య ప్రమా ణం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహాన్ని సత్కరించారు. 2019-2025 బ్యాచ్‌లో అత్యంత ప్రతిభావంతుడుగా గుర్తించిన డాక్టర్ సాయి అనిరుధ్ ఉపన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 9 అవార్డులు, 5 బంగారు పతకాలు సాధించిన ఆయన అందరి దృష్టిని ఆకర్షించారు. ఐదున్నరేళ్ల విద్యలోని పాఠ్యాంశాలు ఎంతో విలువైనవన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు మాట్లాడుతూ రంగరాయ వైద్య కళాశాలలో అత్యంత క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన పిల్లలకు అందిందని హర్షం వ్యక్తం చేశారు. రంగరాయలో తమ పిల్లలు చదువుతున్నందుకు గర్వపడుతున్నామంటూ ఎవరికైనా చెప్పడంలో ఎంతో సంతృప్తి ఉంటుందంటూ సంతోషం వ్యక్తం చేశారు.

ఏలేశ్వరంలో పిచ్చికుక్క స్వైరవిహారం

● 15మందికి గాయాలు

ఏలేశ్వరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):నగర పంచాయతీ పరిధిలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి 15మందిని గాయపరిచింది. ఆదివారం స్థానిక నెయిల్‌పేట, మందుల కాలనీ, పెద్దవీధి, నందివీధులలో పిచ్చికుక్క కరవడంతో వీరంతా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. వీరిలో కార్తికే య, జాన్ అనే చిన్నారులను మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యురాలు శైలజ తెలిపారు.

రావులపాలెంలో బ్యాటరీ బైక్ దగ్ధం



దగ్ధమైన బ్యాటరీ బైక్

రావులపాలెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో పార్కింగ్ చేసిన బ్యాటరీ బైక్ నుంచి మంటలు వ్యాపించి దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పశ్చిమగోదావరిజిల్లా మార్టేరు సమీపంలోని నిక్కపూడికి చెందిన సత్తి పెద్దిరెడ్డి స్థానికంగా ఉన్న బంధువుల ఇంటికి బ్యాటరీ బైక్‌పై వచ్చారు. అక్కడ పార్కింగ్ చేసి లోపలి వెళ్లారు. కొంతసేపటికి బైక్‌లోంచి మంటలు చేలరేగి పెద్దఎత్తున వ్యాపించడంతో బైక్‌లోని బ్యాటరీలు పెలుతాయనే భయంతో సమీపంలోని ప్రజలు పరుగులు తీశారు. పార్కింగ్ చేసిన బ్యాటరీ బైక్ కళ్లేదుటే కాలిపోవడంతో బైక్ యజమాని షాక్‌కు గురయ్యాడు. దీంతో పెద్దిరెడ్డికి స్థానికులు సపర్యలు చేసి ధైర్యాన్ని అందించారు.

సిద్ధివినాయక ఆలయంలో అక్షరాభ్యాసాలు



అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

అయినవిల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం ఫాల్గుణమాసం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు చేశారు. అయినవిల్లి క్షేత్రంలో భక్తులు ఈతి బాధల నివారార్థం నిత్యం జరిగే శ్రీలక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్నారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు.

అర్తమూరు ముద్దు బిడ్డగా గర్విస్తున్నా

● గ్రామంలో ఆధ్యాత్మిక పరిమళాలు భేష్

● గ్రామాభివృద్ధికి సహకరిస్తా : యూపీ డీజీపీ రామశాస్త్రి



యూపీ డీజీపీ వెంకట రామశాస్త్రి దంపతులను సత్కరిస్తున్న స్థానికులు, మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

మండపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి) ఆగస్త మహాముని, పెద్ద జీయర్, చిన్నజీయర్‌లు జన్మించిన పుణ్యభూమి అర్తమూరులో జన్మించినందుకు తనకెంతో గర్వంగా ఉందని యూపీ డీజీపీ పిడపర్తి వెంకట రామశాస్త్రి అన్నారు. మండపేట మండలం అర్తమూరు గ్రామంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారి 17వ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమానికి డీజీపీ వెంకటరామ రామశాస్త్రి, నీరజ దంపతులు ఆదివారం రాత్రి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన ప్రముఖులు, ఆలయ నిర్వాహకులు రామశాస్త్రి, నిరజ దంపతులకు ఆలయ మర్యాదలతో ఆదివారంరాత్రి ఘనస్వాగతం పలికారు. శాస్త్రి తాను పుట్టిపెరిగిన అర్తమూరులో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసు కున్నారు. ముందుగా శాస్త్రి దంపతులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ఆలయ నిర్వాహకులు శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ట్రస్టీ ఎస్.బీఎస్.ఆర్ ట్రస్టీ సత్తి బుల్లి స్వామిరెడ్డి అధ్యక్షతన శాస్త్రి దంపతులను ఘనంగా సత్కరించారు. అర్తమూరుకు చెందిన శాస్త్రి ఇక్కడ ప్రజలకు చేసిన సేవలను వారు కొనియాడారు. శాస్త్రి తండ్రి రామం గ్రామంలో ఎంతోమందికి విద్యాభ్యాసం చేయించారని ఆయనవద్ద నేర్చుకున్న వారెందరో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. తాను ఏ స్థాయిలో ఉన్నా ఇక్కడ మూలాలు మరిచిపోనని అర్తమూరు వాసులకు ఏ సాయం కావాలన్నా తన వంతు అందిస్తానని ఆయన చెప్పారు. ఇక్కడ వాతావరణం ఆధ్యాత్మిక చింతన ఎంతో బాగుందన్నారు. శాస్త్రి దంపతులను అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తిసూర్యానారాయణరెడ్డి, ఆలయట్రస్టీ సత్తి బుల్లిస్వామిరెడ్డి, కర్రి బాపిరెడ్డి, పడాల సుబ్బారెడ్డి తదితరులు ఘనం గా సత్కరించారు. రాజమహేంద్రవరంనకు చెందిన స్వామీ న్యూరాలజీ ఆసుపత్రి వైద్యులు పరిమి నాగసత్య ప్రసాద్, డాక్టర్ సత్తి బుల్లి స్వామిరెడ్డి దంపతులను ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

రాజ్యాంగ హక్కులపై ప్రజలకు అవగాహన అవసరం

● ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల



ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావుకు అమరజ్యోతి అంబేడ్కర్ పుస్తకాన్ని అందజేస్తున్న రచయిత పొనుగుమట్ల విష్ణుమూర్తి

యానాం,మార్చి2(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యంగంలో దేశ ప్రజలకు అంబేడ్కర్ కల్పించిన హక్కులపై ప్రజలకు పూర్తి అవగాహనతోపాటు హక్కుల పరిరక్షణకు ఉద్యమించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ పౌరహక్కుల సంఘ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది ముప్పాల సుబ్బారావు అన్నారు. యానాం సర్వశిక్ష అభియాన్ సమావేశపు హాలులో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75ఏళ్లు అయిన సందర్భంగా ఏపీ హేతువాద సంఘం, యానాం సివిల్‌రైట్స్ సొసైటీ, యానాం డాక్టర్ అంబేడ్కర్ సంక్షేమసంఘ సంయుక్త నిర్వహణలో జనజాగృతి సభ ఆదివారం నిర్వహించారు ఈ సభలో ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ రాజ్యంగంలో అంబేడ్కర్ ఎంతో దూరదృష్టితో ప్రజలకు మత స్వేచ్ఛతోపాటు భావవ్యక్తీకరణ స్వేచ్ఛ కల్పించారన్నారు. కానీ, అవి హరించ బడుతున్నాయన్నారు. రాజ్యాంగ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. సభలో అఖిల భారత హేతువాద సంఘం ప్రతినిధి నార్నె వెంకటసుబ్బయ్య శాస్త్రీయ, మానవతా దృక్పథంపై ప్రారంభోపన్యాసం చేశారు. సభకు యానాం సివిల్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం ప్రముఖకవి దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ దేశానికి పటిష్టమైన రాజ్యాంగం ఉండడంవల్ల ఎన్నో తట్టుకుని దేశం నిలబడుతుందన్నారు. సమావేశంలో మాజీ పరిపాలనాధికారి గిడ్డి బలరాం, నామడి అప్పారావు, పండు సిద్ధార్థ కుమార్, దవులూరి పతి పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలను ఆదివారం కాకినాడలో నిర్వహించారు. అధ్యక్షుడిగా వి.శ్రీనివాసరావు, సహ అధ్యక్షుడిగా వి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఈశ్వరి, వి.శ్రీనివాసు, వి.శశికుమార్, ఎం.విశ్వనాథం, కార్యదర్శిగా వై.భాస్కర్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా నజీర బేగం, బీవీవీ సత్యనారాయణ, ఆర్.జయకృష్ణ కోశాధికారిగా వైఎస్ మూర్తి, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా శ్రీనివాస్, పాపారావు, హైదర ఆలీపాషా, ఉదయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా జి.రామ్మోహన్‌రావు, పి.కిరణ్‌కుమార్, డి.రమణారెడ్డి వ్యవహరించారు.



డీఎంఈ నరసింహం నుంచి పట్టాలు అందుకున్న సౌజన్య, శరణ్య

కవల డాక్టర్లకు పట్టాభిషేకం

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): 25వ వసంతంలోకి అడుగిడిన ఆ కవలల బంధం అలానే ఉంది. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్య కలిసే చదువుకున్న వారిద్దరూ నీట్‌లో ఉత్తీర్ణులై ఒకే వైద్య కళాశాలలో చేరి ఒకేసారి ఎంబీబీఎస్ పట్టాలు పొందారు. కాకినాడ జిల్లా రవాణా శాఖలో పరిపాలనాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.రాము-సత్యవతి దంపతులకు 2000లో ఆడ కవలలు జన్మించారు. వారి పేర్లు సౌజన్య, శరణ్య. 2019లో నీట్ పరీక్ష రాసి మంచి ర్యాంకులు సంపాదించి కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. ఆదివారం జరిగిన 62వ స్నాతకోత్సవంలో వారు డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం నుంచి పట్టాలు అందుకున్నారు. ఈ సన్నివేశాన్ని తిలకించిన గురువులు, తల్లిదండ్రులు, సహచర విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



విద్యార్థుల ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్

ఆకట్టుకున్న 'ఇన్‌స్పైరా'

పిఠాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న నైపుణ్యం, ప్రతిభను వెలికితీసేందుకు ప్రదర్శనలు, ఉత్సవాలు దోహదం చేస్తాయని జిల్లా సైన్స్ అధికారి ఎం శ్రీనివాస్‌వినీల్ తెలిపారు. పట్టణంలోని సీతయ్యగారితోటలో గల ఆదిత్య పాఠశాలలో ఇన్‌స్పైరా-2025 అకడమిక్ ఉత్సవాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు 264 ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ ప్రాజెక్టులతో పాటు పిఠాపురం ఆధ్యాత్మికత, సంస్కృతి-సంప్రదాయాలు, జానపద కళలు, అష్టావధానం, ఇతిహాసాలు, ఛందస్సు-పద్యరచన తదితర అంశాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.విజయసారథి, న్యాయనిర్ణేతలు చిందాడ చిన్నోడు, తిరగటి గణేష్, అల్లంరాజు మూర్తి, కొవ్వాడ ఫణికుమార్, వీరలక్ష్మీనారాయణ, కుమారి, మహ్మద్ జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



మహా యాగ పూర్ణాహుతి జరుపుతున్న వేద పండితులు

ముగిసిన సవిత్ర కాఠక చయన మహా యాగం

పిఠాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం పట్టణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సవిత్ర కాఠక చయన మహా యజ్ఞం ఆదివారం సాయంత్రం ముగిసింది. ఉదయం గోపూజ, రుద్రాభిషేకం, నమకం, చమకం, హోమం పరిసమాప్తి జరిగాయి. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య మహా పూర్ణాహుతిని వైభవంగా నిర్వహించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం తీర్థ వితరణ సాగింది. వేదపండితులు ఉప్పులూరి సత్యనారాయణ అవధానులు, ద్విభాష్యం రాంబాబు, సురేష్‌శర్మ యాగ క్రతువును జరిపించారు. మైథిలి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మీనాక్షి గిరిధారి, అనంత్ పూజారి నిర్వహించగా అమేయ, ఆరాధ్య, బీజేపీ మహిళా మోర్చా తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వినికిడి పరీక్షలు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ఆడియో లోజిస్ట్, స్పీచ్ లాంగ్వేజ్ పాథోలోజిస్ట్ అసోసియేషన్ తరపున వినికిడి సమస్య ఉన్న వారికి ఉచిత పరీక్షలు, అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు ఏపీఏఎస్ఎల్‌పీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పి.గోపివెంకటేష్ తెలిపారు. ఆదివారం కాకినాడలో సమావేశం నిర్వహించారు. కాకినాడలో వాగ్దేవి స్పీచ్, హియరింగ్ క్లినిక్, శ్రావ్య స్పీచ్ హియరింగ్-కాక్లియర్ ఇంప్లాంటేషన్ సెంటర్, హియర్ జాప్, మహి స్పీచ్ హియరింగ్ క్లినిక్, అమలాపురంలో కోనసీమ స్పీచ్, హియరింగ్ సెంటర్, రాజమహేంద్రవరంలో దేవి కేర్ స్పీచ్, హియరింగ్ క్లినిక్ లో ఉచిత వినికిడి పరీక్షలు, సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో డాక్టర్ డి.సూర్యనారాయణ, డాక్టర్ పి.రేణుకదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు

తాటిపర్తిలో ఉత్సవమూర్తులకు ధాన్యాధివాసం

గొల్లప్రోలు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి నూతనంగా తయారు చేయించిన పంచలోహ ఉత్సవమూర్తులకు ఆదివారం ధాన్యాధివాసం నిర్వహించారు. వేద పండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపించగా విగ్రహ దాతలు ఆకొండి ప్రభాకరశాస్త్రి-వెంకటసూర్యలక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, చెరుకు శీనుబాబు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాదివాసంలో పాల్గొన్న విగ్రహ దాతలు

మకరతోరణం నిర్మాణానికి నేడు శంకుస్థాపన

గొల్లప్రోలు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానానికి (శివాలయం) మకరతోరణం (స్వాగత ద్వారం) నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి పెదబాబీ తెలిపారు. భక్తులు, పట్టణ ప్రజలు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.





ఎస్సీ కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు, పల్లపు వీధిలో పట్టపగలు వెలుగుతున్న లైటు, రామాలయం సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పొంగిపొర్లుతున్న డ్రైన్లు... పగటిపూటే విద్యుత్ వెలుగులు

ఇదీ దుర్గాడ దుస్థితి

గొల్లప్రోలు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రహదారులపై ప్రవహిస్తున్న మురుగునీరు, పొంగిపొర్లుతున్న డ్రైన్లు, వీధుల్లో నడవాలంటే ముక్కుమూసుకోవాల్సిందే. ఇదీ గొల్లప్రోలు మండలం దుర్గాడలో పారిశుధ్య పరిస్థితి.

పారిశుధ్య వారోత్సవాలు, స్పెషల్ డ్రైవ్‌ల పేరిట ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నా అవి ఫొటోలకే పరిమితమవుతున్నాయి. ఏదో ఒక ప్రాంతంలో ఫొటో తీసి ఉన్నతాధికారులకు పంపి కార్యక్రమం అయిందనిపిస్తున్నారు. దుర్గాడలో నెలకొన్న పరిస్థితులే ఇందుకు నిదర్శనం. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో దుర్గంధపూరిత వాతావరణం మధ్య ప్రజలు జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. డ్రైన్లలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ రోడ్లపై ప్రవహిస్తోంది. పలు ప్రాంతాల్లో నెలల తరబడి మురుగునీరు రోడ్లపై ఉంటున్నా తొలగించేందుకు కనీస చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్లపు వీధి, యాదవులపేట, ఈబీసీ కాలనీ, ఎస్సీ కాలనీ మెట్ట సహా పలు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారుల వెంబడి డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. మరోవైపు పలుచోట్ల కుళాయిలు నుంచి తాగునీరు వృథాగా పోతున్నా, పగటి పూటే వీధిలైట్లు వెలుగుతున్నా పట్టించుకునవారే కరువయ్యారు. తద్వారా విద్యుత్ వృథా అయి కరెంటు బిల్లుల రూపేణా పంచాయతీపై అధనపు భారం పడుతోంది.



యాదవులపేటలో పట్టపగలు వెలుగుతున్న వీధిలైటు, కింద కుళాయి నుంచి వృథాగా పోతున్న తాగునీరు

గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో పాటు పర్యవేక్షణకు వచ్చే మండల, డివిజన్, జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గ్రామంలోని అంతర్గత రహదారులపై మురుగునీరు నెలల తరబడి ప్రవహించడంతో పాటు కొన్నిచోట్ల నీరు నిలిచిపోతున్నా నివారణ చర్యలు చేపట్టకపోవడం విస్మయం కలిగిస్తోంది. ఇటువంటి పరిస్థితుల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

'పట్టుదలకు నైపుణ్యం తోడైతే విజయం ఖాయం'

సామర్లకోట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టుదల, శారీరక దృఢత్వానికి నైపుణ్యం తోడైతే అన్ని రంగాల్లో విజయం ఖాయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నీలో 70 ప్లస్ విభాగంలో విన్నర్‌గా, 60 ప్లస్ విభాగంలో రన్నర్ నిలిచిన టెన్నిస్ క్రీడాకారుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త పసల పద్మరాఘవరావుకు సామర్లకోట లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం సాయంత్రం అభినందన సత్కార సభ నిర్వహించారు. జడ్పీ ఎంపీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు ప్రసంగించారు. సత్కార గ్రహీత పద్మ రాఘవరావు మాట్లాడుతూ సూరిబాబురాజు సహకారం తనకు ఎంతగానో ప్రోత్సాహాన్నిచ్చిందన్నారు. పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు, సీనియర్ క్రీడాకారులు రాఘవరావుకు శాలువా కప్పి గజమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. డాక్టర్ పసల సత్యానందరావు, యంద్రు ప్రభాకరరావు, కొప్పిరెడ్డి సత్యనారాయణ, గంధం రామకృష్ణ, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ (చిన్ని), కంటే జగదీష్‌మోహన్ (బాబు), బడుగు శ్రీకాంత్, బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పద్మరాఘవరావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు

'వాహనాల లైసెన్స్ జారీ, ఫిట్‌నెస్ తనిఖీలను

ప్రైవేటు వ్యక్తులకు అప్పగించొద్దు'

కాకినాడ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వాహనాల లైసెన్స్‌ల జారీ, ఫిట్‌నెస్ తనిఖీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించరాదని, ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికుల సమస్యలపై ఆదివారం ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులకు నష్టం చేకూర్చే హిట్ అండ్ రన్ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఫైన్‌ల పేరుతో రవాణా రంగ కార్మికులపై ప్రభుత్వం వేస్తున్న భారాలను తక్షణం విరమించుకోవాలన్నారు. ఇప్పటివరకు లైసెన్స్‌లు జారీ చేసే పనిని ఆర్టీవో కార్యాలయ అధికారులు చేపట్టేవారని, ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమన్నారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న భారీ స్థాయిలో మరో సమావేశం ఏర్పాటు చేసుకుని పోరాటానికి సిద్ధపడాలన్నారు. అన్ని రకాల ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికుల సమస్యలపై ఈ నెల 24న పార్లమెంట్ వద్ద జరిగే ఆందోళనకు మద్దతుగా కాకినాడ కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ, టాటా మ్యాజిక్ యూనియన్ నగర అధ్యక్షుడు వాలిశెట్టి శ్రీను, సత్యనారాయణ, గూడ్స్ వాహనాల యూనియన్ నాయకులు నాగరాజు, సూరిబాబు, ప్రకాష్, గంగాధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శేషుబాబ్జీ

మేల్ నర్సుపై విచారణ పూర్తి

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఖాళీ పత్రాలపై సంతకాలు సేకరించి నర్సులను తప్పుదోవ పట్టించిన మేల్ నర్సుపై విచారణ పూర్తయ్యింది. విచారణాధికారులు నివేదికను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారికి అందించారు. నర్సుల సమస్యల పరిష్కారం కోసమని జీజీహెచ్‌లో పని చేస్తున్న సుమారు 60 మంది నర్సులతో ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించి వారిని తప్పుదోవ పట్టించిన కాంట్రాక్ట్ బేస్డ్ మేల్ నర్సు పోలాబత్తిన శ్రీనివాసరావుపై ఆసుపత్రి అధికారులు విచారణకు ఆదేశించారు. దాంతో సూపరింటెండెంట్ చైర్మన్‌గా గత నెల 13వ తేదీన విచారణ కమిటీ ఏర్పడింది. 15 రోజుల విచారణానంతరం నివేదికను సూపరింటెండెంట్‌కు అందజేసింది. దీని ఆధారంగా మేల్ నర్సుపై అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పిఠాపురం రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం విరవాడ పాతులపేటలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆదివారం ఘనంగా జరిగింది. పాత ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయం నిర్మించినట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు



అవగాహన సదస్సులో పాల్గొన్న త్రివిధ దళాల రిటైర్డ్ అసోసియేషన్ సభ్యులు

'విశ్రాంత సైనికుల కుటుంబాలకు అండ'

సర్పవరం జంక్షన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని సైనిక సంక్షేమ కార్యాలయంలో కాకినాడ త్రివిధ దళాల అసోసియేషన్ ఫౌండర్ కమ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యదేవర రామారావు ఆధ్వర్యంలో సైనికుల కుటుంబ సభ్యులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రిటైర్డు సైనికులు, కుటుంబ సభ్యులకు పెన్షన్ సదుపాయం, ఆసుపత్రి సేవలు, వైద్య సేవలు, బ్యాంకు లావాదేవీలపై తీసుకోవాల్సిన చర్యలను అధ్యక్షుడు ఎస్.నగేష్, గౌరవాధ్యక్షుడు జీవీఎస్ఎన్ మూర్తి వివరించారు. విశ్రాంత సైనికులు మృతి చెందితే వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వపరంగా రావాల్సిన పెన్షన్, రాయితీలపై అవగాహన కల్పించారు. అవగాహన సదస్సులో జనరల్ సెక్రటరీ డీకే వరప్రసాద్, ట్రెజరర్ బి.సుగుణ, సభ్యులు సీహెచ్ఎస్‌వీ మూర్తి, బి.శంకర్, బి.రవికుమార్, బి.మల్లేశ్వరరావు, డీఎస్‌డబ్ల్యువో సూపరింటెండెంట్ వెంకట్రావు, యూఆర్‌సీ మేనేజర్ నాగేశ్వరరావు, ఈహెచ్ఎస్ హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక నమాజు చేస్తున్న ముస్లింలు

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

సామర్లకోట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని ప్రధాన మసీదుల్లో నెల రోజులు చేసే ఉపవాస దీక్షలను ముస్లింలు ఆదివారం ప్రారంభించారు. రంజాన్ విశిష్టతను ఇమామ్‌లు వివరించారు.



ఉప రాష్ట్రపతి దంపతులకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎంపీ సతీష్‌బాబు

ఉప రాష్ట్రపతిని కలిసిన ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భారత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ దంపతులను రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్ ఐఐటీ సందర్శనకు విచ్చేసిన ఆయనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ఎంపీ సతీష్‌బాబు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికి శాలువాతో సత్కరించి పుష్పచ్ఛం అందజేశారు. ఉప రాష్ట్రపతితో కలిసి ఐఐటీని సందర్శించారు.



జేసీ కుటుంబీకులకు ఆశీర్వచనం ఇస్తున్న వేద పండితులు

భీమేశ్వరస్వామికి

జేసీ పూజలు

ద్రాక్షారామ, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి ఆదివారం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా కుటుంబ సమేతంగా విచ్చేశారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి నంది మండపంలో వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం

పెద్దాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ దేవస్థానంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. భవిష్యత్తులో నిత్యాన్నదానం జరిపేందుకు చర్యలు చేపట్టనున్నట్టు సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



కాకినాడ రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తూరంగిలోని శుభం కౌంటీ ప్రాంత ప్రజల సహకారంతో రూరల్ సీఐ చైతన్యకృష్ణ పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన 20 ప్రైవేట్ సీసీ కెమెరాలను ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ, పరిసర ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్, దొంగతనాలను నివారించడానికి, నేరాలకు పాల్పడిన వారిని పట్టుకునేందుకు వీటిని ఏర్పాటు చేశామని చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

ఐదుగురి అరెస్టు

పిఠాపురం రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం వెల్దుర్తిలో పేకాట శిబిరంపై సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఐదుగురిని అరెస్టు చేసి రూ.12,100 నగదు, ఎనిమిది వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో పిఠాపురం రూరల్ ఎస్ఐ గుణశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కెనెడియన్ బాప్టిస్టు మిషన్ ఉత్సవం

పిఠాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు గడ్డపై కెనడియన్ బాప్టిస్టుల పరిచర్య ప్రారంభమై 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పట్టణంలోని ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి ఆధ్వర్యంలో సోమవారం కెనెడియన్ బాప్టిస్టు మిషన్ పంచాశదిక శతవత్సర ఉత్సవం నిర్వహిస్తున్నట్టు చర్చి అధ్యక్షుడు గుబ్బల సాల్మన్‌రాజు తెలిపారు. ఇందులో భాగంగా సెంటినరీ హాలుపై నూతనంగా నిర్మించిన డాక్టర్ ఈజీ స్మిత్ మెమోరియల్ హాలును ప్రారంభిస్తామని చెప్పారు.

శ్రీసాయిబాబా ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఏలేశ్వరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): యర్రవరం గ్రామంలో షిర్డి సాయిబాబా నూతన ఆలయం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆదివారం గ్రామంలో ఏలేరు నదీ తీరాన ఆలయ నిర్మాణానికి పులి వాసు, ఇందిరాజ్యోతి దంపతులు, గ్రామస్తులతో పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి శ్రీకారంచుట్టారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మన్యం కొండ జాతరకు కట్టుదిట్టమైన భద్రత

● అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా

● ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జి, ఉత్సవ విగ్రహాల మైదానం పరిశీలన



జాతర ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా

మోతుగూడెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలోని పొల్లూరు జలపాతం వద్ద మన్యం కొండ జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన్యం గిరిజన తెగలకు సంబంధించిన పండుగలు నిర్వహించుకుని సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకునే బాధ్యత గిరిజన తెగలపై ఉందన్నారు. సీలేరు నది ఒడ్డుపై ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జిను సందర్శించారు. జాతర కమిటీ యూత్‌ను పంచాయతీ సెక్రటరీ జి.మోహన్ ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జి సామర్థ్యం, భద్రత ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ముందస్తు చర్యలు భాగంగా రెండు పడవలు ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడ నుంచి నేరుగా మన్యంకొండ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను చేసిన మైదానాన్ని పరిశీలించారు. పొల్లూరు జలపాతం వద్ద మన్నె కొండ జాతర పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ ఎస్పీ వెంట సీఐ తెల్లం దుర్గాప్రసాద్, ఎస్ఐ శివనారాయణ, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీ జెన్కో లోయర్ సీలేరు అధికారులు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఈఈ వరప్రసాద్, సర్పంచ్ ఆకేటి సీత, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు ఉన్నారు.

'ఏకలవ్య' ప్రవేశ పరీక్ష

● 264 మంది విద్యార్థుల హాజరు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాజవొమ్మంగి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 264 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో 282 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 18 మంది గైర్హాజరైనట్టు పేర్కొన్నారు. కాగా బాలురు 133 మంది, బాలికలు 131 మంది పరీక్షలు రాశారన్నారు. ఎంఈవోలు సత్యనారాయణదొర, సూరయ్యరెడ్డి తనిఖీ చేశారన్నారు.

ఉత్సవమూర్తుల పల్లకీ ఊరేగింపు



స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం కొండపై శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి విశిష్టతలో భాగంగా ఆదివారం పల్లకీ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, టీడీపీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు అధ్యక్షతన గ్రామపురవీధుల్లో ఉత్సవ మూర్తులను బాజా భజంత్రీలు, మంగళవాయిద్యాలతో ఊరేగించారు. కార్యక్రమంలో అద్దేపల్లి చిన్నారావు, పెదిరెడ్ల సత్యనారాయణ, జెట్టి మధు, మరిచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండలుపోయి ... గుంతలు మిగిలాయి



గోతులమయంగా మారిన సూరంపాలెం గుల్లమెట్ట

● సూరంపాలెం గుల్లమెట్ట దుస్థితి

గండేపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రామేశ్వరంపేటలో సుమారు 216 ఎకరాలకు పైగా ఉండే గుల్లమెట్ట ఒకప్పుడు పచ్చని చెట్లతో కళకళలాడేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యనేతల కళ్లన్నీ గుల్లమెట్టపై పడింది. దీంతో అరకొర అనుమతులతో రాత్రి, పగలు లేకుండా గ్రావెల్‌ను ఇతర జిల్లాలకు తరలించేశారు. ప్రస్తుతం పెద్దపెద్ద లోయలను తలపించేలా ఆ ప్రాంతం భయంకరంగా మారింది. విద్యుత్ స్తంభాల చుట్టూ ఉన్న గ్రావెల్‌ను కూడా తొలగించేయడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రావెల్ అక్రమంగా తరలించుకుపోయినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమ తవ్వకాలు నిలిచిపోగా, ప్రభుత్వ పనులకు తప్ప అక్రమ తవ్వకాలకు బ్రేక్‌లు పడినట్టు తెలిసింది.

బాబోయ్ కోతులు..!



మల్లేపల్లిలో ఓ ఇంటి కప్పుపై ఉన్న కోతులు

గండేపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కోతుల బెడదతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. తెల్లవారగానే కోతుల గుంపు ఇళ్లల్లోకి చొరబడి పలు వస్తువులను నాశనం చేయడంతోపాటు తమపై దాడి చేస్తున్నాయని గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. తలుపులు తీసుకుని మరీ ఇళ్లల్లోకి కూడా వచ్చేస్తున్నాయని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి తమకు రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

ఉప రాష్ట్రపతిని కలిసిన ఎంపీ సతీష్‌బాబు



ఉప రాష్ట్రపతి దంపతులకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భారత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ దంపతులను రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్ ఐఐటీ సందర్శనకు విచ్చేసిన ఆయనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఎంపీ సతీష్‌బాబు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికి శాలువాతో సత్కరించి పుష్పచ్ఛం అందజేశారు. ఉప రాష్ట్రపతితో కలిసి ఐఐటీని సందర్శించారు.

నేడు కెనేడియన్ బాప్టిస్టు మిషన్ ఉత్సవం

పిఠాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు గడ్డపై కెనడియన్ బాప్టిస్టుల పరిచర్య ప్రారంభమై 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా పట్టణంలోని ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి ఆధ్వర్యంలో సోమవారం కెనేడియన్ బాప్టిస్టు మిషన్ పంచాశధిక శతవత్సర ఉత్సవం నిర్వహిస్తున్నట్టు చర్చి అధ్యక్షుడు గుబ్బల సాల్మన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సెంటినరీ హాలు పై నూతనంగా నిర్మించిన డాక్టర్ ఈజీ స్మిత్ మెమోరియల్ హాలును ప్రారంభిస్తామని చెప్పారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

చెరువులో అడుగంటిన నీరు...చేపల మృత్యువాత

● చెరువు పన్ను మినహాయించాలని నాయకులు, ఫిషర్ మెన్ సొసైటీ వినతి





ఎండిపోయిన చెరువు, చనిపోయిన చేపలు

జగ్గంపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించి ముత్యాలమ్మ చెరువులో నీరు అడుగింటడంతో ఆదివారం వేలాది చేపలు మృత్యువాతకు గురయ్యాయి. ఇది తెలియగానే తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు చెరువు వద్ద పరిస్థితిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొన్నాళ్ల నుంచి ఈచెరువులో దళిత సంఘాలు ఫిషర్‌మన్ సొసైటీగా ఏర్పడి చేపలు పెంచుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నారని తెలిపారు. శనివారం రాత్రి వారంతా చేపలు పట్టుకున్నారని తెలిపారు. ఏడాది నుంచి అప్పులు చేసి వాటిని పెంచుతుంటే ఇటీవల ఎండ తీవ్రతతో పాటు నీరు అడుగంటి పోవడం వల్ల సుమారు ఐదారు టన్నుల చేపలు మృత్యువాత పడ్డాయని తెలిపారు. దీంతో రూ.3లక్షలకు పైగా వారికి నష్టం వాటిల్లిందని తెలిపారు. అధికారులు స్పందించి ఈసంవత్సరానికి కట్టే పన్నుల నుంచి మినహాయింపు కలిగించేలా చూడాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూని కలిసి వివరించినట్టు తెలిపారు. ఇటీవల జరిగిన ఇరిగేషన్ సమావేశంలో చెరువులోని పూడికతీస్తే వారి జీవనోపాధి మెరుగుపడుతుందని ఎమ్మెల్యే నెహ్రూ పేర్కొన్నారు. ప్రణాళికఏర్పాటు చేశారని అడబాల వెంకటేశ్వరరావు గుర్తుచేశారు.

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం

అన్నవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జిత సేవ అయిన రథోత్సవం ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన టేకు రథంపై ఆశీనులుగావించి ప్రత్యేక పూజలు అనంతరం భక్తుల గోవింద నామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షణగావించారు. పండితుల వేదాశీర్వచనాలు అనంతరం హారతులిచ్చి స్వామి,అమ్మవార్లను ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

వైభవంగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్తిపాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పాండవులపాలెంలో ఆదివారం కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు నిర్మించిన ఆలయంలో శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి విగ్రహప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



కోటనందూరు పాఠశాలలో సమావేశానికి హాజరైన విద్యార్థులు

కోటనందూరు, మార్చి2(ఆంధ్రజ్యోతి): పూర్వపు విద్యార్థుల కలయికకు కోటనందూరు ఉన్నత పాఠశాల వేదికైంది. 2006-07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, వారి బాగోగులు తెలుసుకుంటూ ఆనందంగా రోజంతా గడిపారు. పాత జ్ఞాపగాలను నెమురవేసుకుంటూ ఆటపాటలతో వేడుక చేసుకున్నారు. మళ్లీ కలుసుకుందాం అంటూ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోవలో భక్తుల కోలాహలం

ఆలయానికి రూ.3.4 లక్షల ఆదాయం



తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు వేకువజామునే లోవ క్షేత్రానికి తరలివచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న పలువురు భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు ఆరుబయట మామిడితోటల్లో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజే ఆలయానికి రూ.3.4 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో విశ్వనాధరాజు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బీజేపీని బలోపేతం చేయాలి



బీజేపీ రాష్ట్ర నాయకులతో ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నాయకులతో ఆదివారం ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ నాయకులు సమావేశమయ్యారు. కాకినాడ విచ్చేసిన బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాశి రాజులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు సమక్షంలో నియోజకవర్గ బీజేపీ నాయకులు సత్కరించారు. ఈ సమావేశంలో పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతంపై రాష్ట్ర నాయకులు దిశా నిర్దేశం చేశారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ రావూరి సుధ, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మత్తు మంగరాజు, ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్లు సింగిలిదేవ్ సత్తిరాజు, మండల కమిటీల అధ్యక్షులు ఊటా వీరబాబు, నీలి సురేష్, లౌడు శ్రీను, జిల్లా ఎస్సీ సెల్ మోర్చ అధ్యక్షుడు కించు జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా సబ్‌హెల్త్ సెంటర్

● అసాంఘిక కార్యకలాపాలతో ఉద్యోగుల ఇబ్బందులు



మందుబాబులు పడేసిన బీరు సీసాలు

రౌతులపూడి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో పాత పశువుల ఆసుపత్రి సమీపంలో రైతు భరోసా, సబ్‌హెల్త్ సెంటర్ నిర్మించారు. ప్రస్తుతం ఈభవనాల్లో అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. రూ.40లక్షలతో నిర్మించిన ఈభవనాలకు ప్రహరీ లేకపోవడంతో మందుబాబులకు నిలయంగా మారింది. సాయంత్రం ఆరు గంటలు దాటితే చాలు యువకులు భవనాల వద్దకు చేరుకుని మద్యం సేవిస్తున్నారు. మద్యం తాగేసి బాటిళ్లు అక్కడే పడేస్తున్నారు. ఉదయం విధులకు హాజరైన సిబ్బందికి మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. కొందరైతే ఆ ప్రాంతాన్ని బహిర్భూమికి ఉపయోగిస్తున్నారు. దీంతో సిబ్బంది విధులు నిర్వర్తించే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతోనే అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

జె.కొత్తూరులో నీటి సమస్యకు పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జె.కొత్తూరులో నీటి సమస్యపై మహిళల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో చంద్రశేఖర్

జగ్గంపేట రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జె.కొత్తూరు గ్రామంలో నీటి సమస్యపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. గ్రామంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. నీటి సమస్య ఉన్న వార్డుల్లో పర్యటన చేస్తూ మహిళల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు గ్రామంలో నీటి సమస్య అధికంగా ఉందని, ఒకపూట మాత్రమే నీరు ఇస్తున్నారని తెలిపారు. గ్రామంలో నీటి సమస్య గల కారణాలు, బోర్ల ప్రస్తుత పరిస్థితి గురించి అధికారుల నుంచి సమాచారాన్ని తెలుసుకున్నారు. తక్షణమే నీటి సమస్యపై నివేదిక అందించాలని సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు. గ్రామస్థాయి అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామంలో పర్యటించి నీటి సమస్యపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో నీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామని ఎంపీడీవో తెలిపారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ ఎంఎస్ భాస్కరరావు, పంచాయతీ పంచాయతీ సెక్రటరీ కె.శ్రీనివాస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మౌనిక తదితరులు ఉన్నారు.

లోవ భక్తులను దోచుకుంటున్న దుకాణదారులు



కొబ్బరికాయలు కొట్టే స్థలంలో నిర్వాహకుడు సీసీ కెమెరాలకు చిక్కకుండా ఏర్పాటు చేసిన గుడారం

తుని రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ క్షేత్రానికి వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఇదే అదనుగా భావించి ఆలయంలోని దుకాణదారులు భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ఆలయ నిబంధనలు తుంగలోకి తొక్కి అందినకాడికి దోచుకుంటున్నారు. టోల్‌గేట్ నుంచి కొబ్బరికాయల వరకు ప్రతి దాంట్లో రెట్టింపు వసూళ్లకు పాల్పడుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. తరచూ టోల్‌గేట్ వద్ద వాహనదారులకు, కాంట్రాక్టర్‌లకు మధ్య రెట్టింపు వసూళ్లపై వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ విషయం తెలిసినా అధికారులు చూసీ చూడనట్లు వదిలేయడం పలు విమర్శలకి తావిస్తున్నది. ప్రధానంగా కొబ్బరికాయలు కొట్టే స్థలంలో సదరు కాంట్రాక్టర్ ఘరానా మోసం గతంలో తీవ్ర దుమారం తలెత్తింది. భక్తుల నుంచి కొబ్బరికాయలు తీసుకుని తిరిగి వాటినే విక్రయించడం, దీనిపై ప్రశ్నిస్తే భక్తులపై వాగ్వివాదానికి దిగడం వంటి పలు సంఘటనలపై ఈవో కార్యాలయానికి ఫిర్యాదులు అందుతున్నట్లు తెలుస్తోంది. ఆలయ ఉన్నతాధికారులు దృష్టిసారించి దుకాణదారుల ఆగడాలను కట్టడి చేయాలని భక్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కిర్లంపూడి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో 43 సంవత్సరాల క్రితం చదువుకున్న 1982-83 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. రాజుపాలెం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ గణేశుల రాంబాబు దంపతుల ఆధ్వర్యంలో గణేశుల లక్ష్మణరావు బ్రదర్స్ బంధువుల పర్యవేక్షణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ దేశాల్లో స్థిరపడిన వారు సైతం ఇక్కడికి వచ్చారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. ముందుగా చదువు చెప్పిన గురువులను సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆటపాటలతో సందడి చేసి గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు.



దుర్గమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

గండేపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మురారి గ్రామ శివారున మామిడితోటలోనున్న దుర్గమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించిన అనంతరం కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు.

భక్తులతో కిక్కిరిసిన అడవిరాజులుబాబు ఆలయం

రౌతులపూడి, మార్చి2(ఆంధ్రజ్యోతి): రాజవరం గ్రామంలో అడవి రాజులుబాబు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. రాజులు బాబుకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ సమీపంలో గల తోటల్లో వంటలు చేసుకుని కుటుంబ సభ్యులంతా భోజనాలు చేశారు.

ఎన్నికల హామీలు మరచిన బడ్జెట్

జగ్గంపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు బడ్జెట్ సరిపోదని పాటంశెట్టి సూర్యచంద్ర వివరించారు. అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ అమలు చేస్తామని హామీ ఇవ్వడంతోనే కూటమిని గెలిపించారన్నారు. నేటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గడిపేస్తున్నారని అన్నారు.

నలుగురి అరెస్ట్

జగ్గంపేట, మార్చి2(ఆంధ్రజ్యోతి): రామవరం గ్రామ శివారున పేకాట నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు జగ్గంపేట ఎస్ఐ రఘునాధరావు, సిబ్బందితో ఆదివారం సాయంత్రం దాడులు జరిపారు. ఈ దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఆయన అన్నారు.


ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి,మార్చి2(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థుల వర్క్‌షాప్ ముగిసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజుల జరిగిన వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, మార్చి2(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి ఆదేశలతో స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ప్రత్తిపాడు పరిధిలో గల శంఖవరం మండలంలో విస్తృతంగా దాడులు చేసి శృంగధార గ్రామం అటవీప్రాంతంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కిర్లంపూడి గ్రామంలో నాటుసారా నిర్మూలనకు నవోదయ 2.0 కార్యక్రమాన్ని గ్రామస్థులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శివప్రసాద్ తెలిపారు.

కాంట్రాక్టర్ లెక్చరర్లను క్రమబద్ధీకరించండి



మంత్రి నాదెండ్లకు వినతిపత్రం అందజేస్తున్న మాణిక్యం

ప్రత్తిపాడు, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను సర్వీసు రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతూ రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్ల ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్మవరానికి చెందిన మాణిక్యం ఆదివారం పిఠాపురం విచ్చేసిన మంత్రి నాదెండ్లను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి నాదెండ్ల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు వివరిస్తామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ నాయియకులు, కాకర చిన్నబ్బాయి, విజయ్ ఉన్నారు.

ఉచిత రక్తదాన శిబిరం

శంఖవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కత్తిపూడి కొత్తూరు శ్రీకృష్ణా ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. పరిసర ప్రాంతాలనుంచి సుమారు 50మంది యువకులు రక్తాన్ని దానంచేశారు. ఏడాది క్రితం యువకులచే ప్రారంభమైన సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించింది. ఎంతోమందికి ఆసరాగా నిలిచింది. దాతల సహాయంతోనే ఇదంతా చెయ్యగలిగామని సంస్థ సభ్యులు తెలిపారు. సంస్థ సభ్యులను గ్రామస్థులు అభినందించారు. రక్తదాతలు, గ్రామస్థులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలి



ఏలేశ్వరం, మార్చి2(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్‌చేసిన ఆర్టీసీ డ్రైవర్ ఎస్వీ రమణను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని యూనియన్ సభ్యులు నిరసన తెలియజేశారు. ఆదివారం ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ యూనియన్ సభ్యులు సంయుక్తంగా డిపో గేటువద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎర్ర రిబ్బన్లతో నిరసన తెలిపారు. స్థానిక డిపోకు చెందిన డ్రైవర్ రమణ 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేశారని రమణను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎన్‌పీ రావు పాల్గొన్నారు.